# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 18-05-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ హరిత వ్యూహాత్మక భాగస్వామ్యంతో భారత్ - నార్వే దేశాలు దీర్ఘకాలిక భవిష్యత్ ను నిర్మించుకుంటాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.

- ❖ దేశవ్యాప్తంగా 2 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ఎరువులు అందుబాటులో ఉన్నాయని ప్రభుత్వం స్పష్టం చేసింది.

- ❖ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, తీవ్రమవుతున్న వడగాలుల నేపథ్యంలో కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ ప్రజారోగ్య సలహాలను జారీ చేసింది.

- ❖ కేరళం నూతన ముఖ్యమంత్రిగా వీ.డీ. సతీశన్ ఈరోజు ప్రమాణ స్వీకారం చేశారు.

=======================

ప్రపంచ వ్యాప్తంగా ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కోవడానికి అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు అత్యవసరమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. భారత్, నార్వే రెండు దేశాలు నియమాల ఆధారిత అంతర్జాతీయ వ్యవస్థను, దౌత్యాన్ని విశ్వసిస్తాయని అన్నారు. కేవలం సైనిక ఘర్షణతో ఏ సమస్యనూ పరిష్కరించలేమని అన్నారు. ఉక్రెయిన్, పశ్చిమాసియాలోని పరిస్థితులను ప్రస్తావిస్తూ... శాంతిని త్వరగా పునరుద్ధరించే లక్ష్యంతో చేసే అన్ని ప్రయత్నాలకు ఇరు దేశాలు మద్దతు ఇస్తాయని చెప్పారు. ఐదు దేశాల పర్యటనలో భాగంగా ఈరోజు నార్వేలో పర్యటించిన ఆయన నార్వే ప్రధాని జోనాస్ గహర్ స్టోర్ తో కలసి ఓస్లోలో ప్రతినిధుల స్థాయి చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య బంధాన్ని 'గ్రీన్ స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్' స్థాయికి పెంచేందుకు ఇరువురు అంగీకరించారు. అనంతరం నిర్వహించిన ఉమ్మడి పాత్రికేయుల సమావేశంలో భారత ప్రధానమంత్రి మాట్లాడుతూ..

(వాయిస్ 24 సెకన్లు)

అంతకుముందు స్వీడన్ పర్యటనను ముగించుకున్న ఆయన ఈ పర్యటన ద్వారా ఇరు దేశాల సంబంధాలకు సరికొత్త వేగం లభించిందని సామాజిక మాధ్యమ ఎక్స్ ద్వారా పేర్కొన్నారు. ఉమ్మడి పరిశోధనల కోసం `జాయింట్

ఇన్నోవేషన్ పార్ట్నర్‌షిప్ 2.0`, శాస్త్ర సాంకేతిక రంగాల బలోపేతానికి `భారత్-స్వీడన్ టెక్నాలజీ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కారిడార్`ను ప్రారంభించామని చెప్పారు. ఐదేళ్లలో ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెట్టింపు చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమాసియా సంక్షోభం కారణంగా దిగుమతులకు అంతరాయం ఏర్పడినప్పటికీ.. దేశంలోని రిఫైనరీలు యధావిధిగా పని చేస్తున్నాయని, భారతదేశం వద్ద తగినంత ముడి చమురు నిల్వలు ఉన్నాయని ప్రభుత్వం తెలిపింది. పశ్చిమాసియాలోని తాజా పరిణామాలపై న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన అంతర్-మంత్రిత్వ మీడియా సమావేశంలో పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ మాట్లాడుతూ... దేశంలో పెట్రోల్, డీజిల్, ఎల్‌పిజి, సహజ వాయువుల నిల్వలు తగినంతగా ఉన్నాయని చెప్పారు. ఏ ఎల్‌పిజి పంపిణీ కేంద్రంలోనూ నిల్వల కొరత ఏర్పడలేదని, అయితే వదంతులు వ్యాపించడం వల్ల దేశంలోని కొన్ని ప్రాంతాల్లో భయాందోళనలతో అధిక కొనుగోళ్లు జరుగుతున్నాయని ఆమె పేర్కొన్నారు. ఇక రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి అపర్ణా ఎస్. శర్మ మాట్లాడుతూ... ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన ఎరువుల లభ్యత 50 శాతానికి పైగా ఉందని తెలిపారు. దేశవ్యాప్తంగా 2 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఆమె చెప్పారు. పశ్చిమాసియా సంక్షోభం తర్వాత దేశీయ ఉత్పత్తి గణనీయంగా సుమారు 86.2 లక్షల మెట్రిక్ టన్నుల మేర ఉందని ఆమె వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

కేరళం నూతన ముఖ్యమంత్రిగా వీ.డీ.సతీశన్ ఈరోజు ప్రమాణ స్వీకారం చేశారు. తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో కేరళం రాష్ట్ర 13వ ముఖ్యమంత్రిగా వీ.డీ.సతీశన్ భాధ్యతలు చేపట్టారు. ఆయనతో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ ప్రమాణం చేయించారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ ఇతర కాంగ్రెస్ సీనియర్ నాయకులు హాజరయ్యారు. సతీశన్‌తో పాటు 20 మంది ఎమ్మెల్యేలను గవర్నర్ మంత్రులుగా ప్రమాణం చేయించారు. వారిలో 14 మంది తొలిసారిగా మంత్రులుగా బాధ్యతలు చేపట్టారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని పలు ప్రాంతాల్లో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, తీవ్రమవుతున్న వడగాలుల నేపథ్యంలో కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ ప్రస్తుత వేసవి కాలానికి గానూ సమగ్రమైన ప్రజారోగ్య సలహాలను జారీ చేసింది. శరీరానికి సరిపడా నీరు తాగడం, ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే మధ్యాహ్న సమయాల్లో నేరుగా ఎండ తగలకుండా చూసుకోవడం, లేత రంగు కాటన్ దుస్తులను ధరించడం, ఆయా కాలాల్లో లభించే పండ్లు, ఎలక్ట్రోలైట్లు ఎక్కువగా ఉండే ద్రవ పదార్థాలను తీసుకోవాలని సూచించింది. వడగాలుల సమయంలో శిశువులు, చిన్నపిల్లలు, గర్భిణులు, వృద్ధులు, ఎండలో పనిచేసే కార్మికులు, గుండె జబ్బులు, బీపీ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు చాలా త్వరగా అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని.. వీరి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించడంతో పాటు నిరంతరం పర్యవేక్షణ అవసరమని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. శరీరానికి చలవనిచ్చే ఆహార నియమాలను పాటించాలని ఆయుర్వేద విభాగం సూచించింది. మజ్జిగ, కొబ్బరి నీళ్లు, నిమ్మరసం వంటి పానీయాలు తీసుకోవడంతో పాటు.. తీవ్రమైన ఎండల్లో శరీర ఉష్ణోగ్రతను నియంత్రించడానికి సాంప్రదాయకంగా తయారు చేసే నిమ్మరసం, మామిడి, చింతపండుతో చేసిన పానీయాలను తీసుకోవాలని సూచించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తర ప్రదేశ్‌లోని లఖింపూర్ ఖేరీ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా వచ్చిన లారీ, ఎదురుగా వస్తున్న మ్యాజిక్ వాహనాన్ని బలంగా ఢీ కొట్టడంతో 9 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా.. మరో ఐదురుగు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. లఖీమ్‌పుర్ ఖీరీలో ఊంచ్ గ్రామంలోని సిసైయా జాతీయ రహదారిపై ఈ ఉదయం 7 గంటల ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. 12 మందికి పైగా రోజు వారి కూలీలతో ప్రయాణిస్తున్న ఈ వాహనం అదుపుతప్పి ముందువెళ్తున్న ట్రక్కును బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ప్రాణనష్టంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి 2 లక్షల రూపాయల చొప్పున ప్రధాని ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. గాయపడి చికిత్స పొందుతున్న వారికి ఒక్కొక్కరికి 50 వేల రూపాయల చొప్పున సాయం అందించనున్నట్లు పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

నైరుతి రుతుపవనాలు మే 26న కేరళను తాకే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ప్రకటించింది. సాధారణంగా ఇవి ప్రతీ ఏడాది జూన్ 1న కేరళంకు చేరుకుంటాయని ఈసారి ఆరు రోజులు ముందుగానే చేరుకునే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. నైరుతి రుతుపవనాలు ఈ రోజు, ఆగ్నేయ అరేబియా సముద్రంలోని మరికొన్ని ప్రాంతాలకు, ఆగ్నేయ బంగాళాఖాతంలోని మరికొన్ని ప్రాంతాలకు, అండమాన్ సముద్రంలోని చాలా ప్రాంతాలకు, తూర్పు మధ్య బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాలకు మరింతగా విస్తరించాయని ఐఎండీ వెల్లడించింది. మరిన్ని వివరాలను ఐఎండీ శాస్త్రవేత్త సుప్రీత్ కుమార్ వెల్లడిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

నీట్ యూజీ-2026 ప్రశ్నా పత్రం లీకేజ్ కేసుతో పాటూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (NTA)లో సంస్కరణల అమలుపై సమీక్షించాలని పార్లమెంటరీ కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు చర్చల కోసం NTA ఛైర్ పర్సన్ ప్రదీప్ కుమార్ జోషి సహా ఇతర ఉన్నతాధికారులకు కమిటీ నోటీసులు జారీ చేసింది. నీట్ పేపర్ లీక్, NTA సంస్కరణలపై ఈ నెల 21న విద్యా మంత్రిత్వ శాఖలోని ఉన్నతాధికారులు కమిటీ ముందు విచారణకు హాజరుకావాలని రాజ్యసభ ఒక ప్రకటన విడుదల చేసింది. ఇక మరో వైపు ప్రశ్నాపత్రం లీకేజ్ పై సీబీఐ దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. గడిచిన 24 గంటల్లో సీబీఐ ఐదు వేర్వేరు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించి.. పలు కీలక పత్రాలు, ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుంది. ఈ కేసులో ప్రముఖ `ఆర్సీసీ (RCC) కోచింగ్ ఇన్‌స్టిట్యూట్` అధినేత ప్రొఫెసర్ శివరాజ్ మొటేగావ్‌కర్‌ను కూడా అరెస్ట్ చేసింది. ఇప్పటివరకు న్యూఢిల్లీ, జైపూర్, గురుగ్రామ్, నాసిక్, పూణే, లాతూర్, అహిల్యానగర్ ప్రాంతాలలో 10 మంది నిందితులను సీబీఐ అరెస్ట్ చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఐపీఎల్-2026లో భాగంగా చెన్నైలోని ఎం.ఎ.చిదంబరం స్టేడియం వేదికగా సన్ రైజర్స్ హైదరాబాద్, చెన్నై సూపర్ కింగ్స్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన చెన్నై 10 ఓవర్లు పూర్తయ్యే సరికి 3 వికెట్ల నష్టానికి 91 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = =